# ఈ తరం స్త్రీ

## రాజ్యలక్ష్మి

"అమ్మా ఓ ముద్ద అన్నం పడెయమ్మా"

వాకిట్లో నిలబడి అరుస్తోంది ముష్టిది. వంటయింట్లోంచి రుక్మిణమ్మ, దొడ్లోనుండి విజయ ఒకేసారి పనిమీద ముందుగదిలోకి వచ్చారు. మరోసారి "బుడ్డోడికి గుప్పెడన్నం పెట్టమ్మా" అని అరిచింది ముష్టిది.

రుక్మిణమ్మ దాని గిన్నెలో అన్నం పడేసి వస్తూ, "అందరికి వుంటారు పిల్లలు, ఎక్కడో పాపిష్టిదానికి తప్ప. ముష్టిదానికన్నా హీనమయిపోయే" అంది.

ఆవిడ విసిరిన వాగ్బాణం యెవరికి తగలాలనుకుందో వాళ్ళను బాగానే గాయపరిచింది. కాస్త దూరంలో కూర్చుని గడ్డం గీసుకుంటున్న మూర్తి తనేం విననట్టు కూర్చున్నాడు. విజయ అభిమానం దెబ్బతింది. ఆ రోజంతా అన్యమనస్కంగానే వుంది మనసంతా.

ఆ సాయంకాలం మూర్తి హడావిడిగా వచ్చి, "త్వరగా తయారవు. సినిమాకు వెడదాం" అన్నాడు.

"ఇప్పుడా? నేను రాలేను. మీరు వెళ్ళండి" అంది విజయ నిరాసక్తిగా.

"ఏమైంది రాలేకపోవటానికి? వెనక పిల్లలు ఏడుస్తారని భయమా, బాధా?" చప్పున అన్నాడు.

చటుక్కున తలెత్తి చూసింది విజయ.

"పిల్లల్ని కని సంతోషపెట్టకపోతే మానె. మొగుడితో సరదాగా సినిమాకు వెళ్ళటానికి కూడ కష్టంగానే వుందా?" మరో మాట వాడిగా విసిరింది అత్తగారు.

విజయ చప్పునలేచి, తయారయిపోయి వచ్చి, "లేవండి" అంది.

మూర్తి తాపీగా లేచి ముఖం కడుక్కుని వచ్చాడు. తీరికగా తల దువ్వుకుని, చెప్పుల్లో కాళ్ళు పెడుతూ, "నేను సరదాగా వెడదామని రమ్మన్నాను. కాని ముఖం ముడుచుకుని కాదు. యిష్టం లేకపోతే మానెయ్యి" అన్నాడు.

విజయ మారు మాట్లాడకుండా చెప్పులేసుకుని అతన్ని అనుసరించింది.


దారిలోగాని, సినిమా హాలులోగాని అతను మామూలుగా మాట్లాడించినా మాట్లాడలేకపోయింది. ఓ వైపు మనసుకు వాతలుపెడుతూ మరోవైపు ఏం జరగనట్టుగా మాట్లాడిస్తున్నాడు. కాని బాధ అనుభవించే తను అలా మామూలుగా మాట్లాడటానికి మనసులేని మరబొమ్మ కాదు గదా. మనసులో అనుకుని నిట్టూర్పు విడిచింది.

తిరిగి పదిన్నరకు యింటికి చేరారు. అత్తగారు తలుపులుతీసి వెళ్ళి పడుకుంది.

విజయకు ఆకలి చచ్చిపోయింది. అతనికి ఒక్కడికే వడ్డించింది.

అతను తినబోతూ, "నువ్వు వడ్డించుకోలేదేం? దేనికీ అలకలు, సాధింపులు?" అన్నాడు.

"అలక తీర్చేవాళ్ళుంటే అలిగినా అందం. సాధింపుకు విలువ వుంటే సాధించిన అర్థం




వుంటుంది. నేనెవరిమీద అలగాలి?" నిర్లిప్తంగా అంది.

"మరి ఇంకెందుకో, అసలేమైనదని?" చిరాకుగా అన్నాడు.

విజయ మాట్లాడలేదు. అతను రెట్టించలేదు తిరిగి.

'ఏమైంది?' ఎంత తేలికగా అడుగుతున్నాడు!? అవును మరి, దెబ్బతినేవాడికే దాని రుచి తెలుస్తుందికాని, కొట్టేవాడికెలా తెలుస్తుంది?

అతను భోజనం చేశాక వంటిల్లు సర్ది గదిలోకి వచ్చింది. సిగరెట్ కాలుస్తూకూర్చున్నాడు మూర్తి. విజయ టేబుల్ మీది 'ఫిలింఫేర్' అందుకుని పేజీలు తిప్పుతూ కూర్చుంది.

మూర్తి సిగరెట్ పీక బయటకు విసిరేసి, "సినిమా మనసు కెక్కనప్పుడు, పుస్తకాలు బుర్ర కెక్కుతాయా? లైట్ తీసేయ్" అని పడుకున్నాడు.

లైట్ తీసేసింది. అతను మరో 5 నిమిషాలకు నిద్రపోయాడు. విజయకు నిద్ర రావటంలేదు. కళ్ళు తెరుచుకుని చీకట్లోకి చూస్తూ కూర్చుంది.

పెరటివైపుకున్న తలుపు తెరిచింది. వెంటనే చల్లటిగాలి, వెన్నెలవెలుగు లోపలికి వచ్చాయి. ఆ మెట్లమీద గుమ్మానికి చేరబడి కూర్చుంది.

'ఈయనెందుకిలా తయారవుతున్నాడు? పిల్లలను పుట్టవద్దని తనందా? వాళ్ళు పుట్టకపోవటానికి, పుట్టటానికి తనా బాధ్యురాలు? తను కూడ పిల్లలు కావాలనే కోరుకుంటోంది కాని వద్దని కాదుకదా? ఇంతమాత్రం ఆలోచన ఈయన కెందుకు లేదు. ప్రతిదానికి ఏదో ఒక వ్యంగ్యోక్తి విసిరి బాధ పెడుతున్నాడు.

విజయ అలా ఆలోచించటానికి కారణం లేకపోలేదు. విజయ పెళ్ళి అయి ఆరు సంవత్సరాలయింది. మూర్తి విజయ అంటే చాలా

ప్రేమగా,అభిమానంగా వుండేవాడు. పెళ్ళయిన క్రొత్తలో యెవరైనా "మళ్ళీ ఈ రోజుకు కొడుకు నెత్తుకుంటావని" పిల్లల గురించి హాస్యమాడితే చిరాకు పడిపోయేవాడు.

"వీళ్ళ కెందుకో యింత కుళ్ళు. మనిద్దరం సరదాగా, హాయిగా వుండటం చూడలేరు కాబోలు. అసలు మన కిప్పుడప్పుడే పిల్లలు పుట్టటం యెంత మాత్రం యిష్టంలేదు. పిల్లలు పుడితే నీకు వాళ్ళను సర్దటం, వాళ్ళకు కావలసినవి సమకూర్చటంతో సరిపోతుంది. ఇంక లైఫ్ ఎంజాయ్ చేసేదెక్కడ?" అనేవాడు.

అత్తగారు విజయ నెప్పుడూ సాధించటంగాని చెప్పటంగాని చేసేదికాదు. అందుకు విజయ ప్రవర్తన కొంతవరకు కారణమైనా, మరి కొంత కొడుకు ఏమంటాడో అనే జంకు వుండేది. అటువంటి ఆవిడ పిల్లిమీదపెట్టి, ఎలికమీద పెట్టి యేదో మాట అనటం మొదలెట్టి, ఇప్పుడు డైరెక్టుగానే యే మాటపడితే ఆ మాట అంటోంది. ఇదంతా మూర్తి చేసిన చులకన. మొగుడు 'ముండ' అంటే ముష్టికొచ్చిన వాడు కూడ 'ముండ' అంటాడని సామెత. నిజమే కాబోలు!

విజయ మెదడు ఆలోచనలతో వేడెక్కిపోతోంది. గుండెల్లో బాధ పేరుకుంటోంది.

'అసలు ఈయనకు తనంటే యింత నిర్లక్ష్యం, నిరసన యెందుకేర్పడినట్టు? పెద్ద నేరస్థురాలిని చూసినట్టు చూస్తున్నాడు. ఇదంతా ఏమిటి? క్రొత్త మోజులో సరదాలు తీరవని పిల్లలొద్దన్నాడు. ఇప్పుడు ఆ మోజులన్నీ తీరిపోయాయని పిల్లలు కావాలంటున్నాడు. వద్దంటే పిల్లలు పుట్టకపోవటానికి, కావాలంటే పుట్టటానికి అది తన చేతిలో పనా? ఇంత స్పష్టంగా కనిపించే విషయం అతనెందుకు అర్థం చేసుకోడు! ఇంతకాలంగా అతను తన కర్థం అయ్యాడనుకుని పొరపాటుపడింది. కాని అతని అభిప్రాయాలు యిప్పుడు తెలుస్తున్నాయి. మారిపోతున్నాడని తను అనుకుంటోంది కాని, అది మారిపోవటం కాదు. సందర్భాన్నిబట్టి అసలు స్వభావం యిప్పుడు బయట పడుతోంది' ఆలోచించేకొలది బాధతో గుండెలు బరువెక్కుతున్నాయి. పిల్లలు లేరనే బాధ కంటే ఆమెను అతని ప్రవర్తన నెక్కువగా బాధిస్తోంది. లేచి తలుపు వేసి వచ్చి, బలవంతంగా నిద్ర తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ కళ్ళు మూసుకు పడుకుంది.

రోజులు గడిచేకొలది యిలాటి సంఘటనలు యెక్కువ అవుతున్నాయి. మనిషి బుర్రలో చెడుగాని మంచిగాని ఆలోచన పుడితే వూరికే పోదు. మూర్తికూడ ప్రస్తుతం అలాటి స్థితిలోనే వున్నాడు.

§ § §

మధ్యాహ్నం వేళలో పిల్లో కవరుమీద ఎంబ్రాయిడరీ చేస్తూ కూర్చుంది విజయ. రుక్మిణమ్మ వంటింటి గడపమీద తలపెట్టి పడుకుంది.

"ఇదేనా మూర్తిగారిల్లు?" బయట యెవరో అడగటం వినిపించి వాకిట్లోకి వచ్చింది విజయ. ఎదురుగా ఉమ. చంకలో బాబు, చేతిని పట్టుకుని పాప. నమ్మలేకపోయింది విజయ. అలా సంభ్రమంతో చూస్తూ నిల్చుండిపోయింది.

"ఏమిటే తల్లీ, ఆ చూపు? రమ్మంటావా, పొమ్మంటావా...?" ముందుకొస్తూ నవ్వింది ఉమ.

"అబ్బ! ఇంత హఠాత్తుగా దర్శనం ఇస్తే నమ్మలేకపోతున్నాను. ఏమిటీ సర్ప్రయిజ్ విజిట్?" ముందుకొచ్చి ఉమ భుజంమీద చెయ్యేసి అంది.

"నయం, పొమ్మనకు. కావాలంటే నేను నేనేనని సాక్ష్యాధారాలతో రుజువు చేసుకుంటాను. ముందయితే నన్ను లోపలకు రానివ్వు" అంది ఉమ.

"చాల్లే, నడువు లోపలకు" పాప చెయ్యందుకుంటూ అంది విజయ.

విజయ, ఉమ మంచి ఫ్రెండ్స్. కాలేజి మొదలెట్టిన దగ్గరనుండి బి. ఏ. పూర్తయ్యే వరకు కలిసి చదువుకున్నారు. పెళ్ళిళ్ళు అయి విడిపోయినా రెగ్యులర్‌గా లెటర్స్ వ్రాసుకుంటారు

"ఏమిటింత హఠాత్తుగా దయ కలిగింది. నా మీద" అంది విజయ!

"ఎంతోకాలం నెలవుకోసం ప్రయత్నిస్తుంటే ఆయనకు యిప్పుడు దొరికింది. అందరినీ ఓసారి చూసిపోదామని బయలుదేరాం.మా

ఆడబిడ్డగారుకూడ యిక్కడే వుంటున్నారు. నువ్వున్నావు. అందుకని యిక్కడో మజిలీ వేశాం."

"అలా చెప్పు. ఇదంతా నామీద ప్రేమ కాదు. ఆడబిడ్డ దగ్గరకు వచ్చి, అలాగే నామీద కూడ ఓ చూపు పారేసిపోవటానికి వచ్చావన్న మాట" కినుకుగా అంది విజయ.

"పోని అలాగే అనుకో. నీ యిష్టం" అంది ఉమ.

పిల్లలిద్దరూ క్రొత్త పరిసరాలు కలయ చూస్తూ కూర్చున్నారు. ముద్దుగా చూడ ముచ్చటగా వున్నారు. విజయ దగ్గరకు తీసుకుంటే క్రొత్త లేకుండా వచ్చారు.

సందడికి రుక్మిణమ్మ లేచి ముందుగదిలోకి వచ్చింది. "మా అత్తగారు" అంది విజయ.

వినయంగా చేతులు జోడించింది ఉమ. "నా స్నేహితురాలు ఉమ. మా ఊరే" అంది.

చాల రోజులుగా అత్తగారితో ముభావంగా వుంటోంది. పరిచయంచేసి లోపలకు వెళ్ళింది కాఫీ ప్రయత్నంకోసం. రుక్మిణమ్మ ఉమతో కబుర్లు మొదలెట్టింది.

కాస్తాగి మూర్తి ఆఫీసునుండి వచ్చాడు. ముందు యెవరో కొత్తవాళ్ళు వచ్చారని వెనకాడినా తరువాత ఉమను గుర్తించాడు. విజయ తల్లిగారింట్లో చూశాడు ఆమెను.

"బాగున్నారా? ఎప్పుడొచ్చారు?" పలకరించి అక్కడే కూర్చున్నాడు.

విజయ ట్రేతో కాఫీకప్పులు తెచ్చింది. అందరికి అందించి, తను కూడ కూర్చుంది.

"అయితే పిల్లలెందరమ్మాయ్?" రుక్మిణమ్మ అడిగింది.

"వీళ్ళిద్దరేనండి" చెప్పింది ఉమ.

"రత్నాల్లా వున్నారు. అందరికి కళ కళలాడుతూ పిల్లలుంటారు. ఎక్కడో మాలాటి దరిద్రులకే ముచ్చటగా యెత్తుకుని మురిసిపోయే జాతకం వుండదు" సాధింపుగా అంది.

"అదేమిటి అలా బాధపడతారు? పుట్టే కాలం అప్పుడే అయిపోయిందా....?" ఉమ అంది.

"ఆ, ఇంక ఒకటే పుట్టటం. వీడికంటే పీడెనకాల పెళ్ళయింది మా చిన్నవాడికి అమ్మాయికీను. అప్పుడే ఒకొక్కరికి ముగ్గురేసి పుట్టారు. ఎంతమందికి పుట్టి ఏం లాభం? జేష్టుడికి పుడితే వంశం నిలుస్తుంది. పేరు వుంటుంది" జేష్టుడి పిల్లలు తప్ప మిగిలిన పిల్లలు పిల్లలుకారు కాబోలు ఈవిడ దృష్టిలో అనుకుంది ఉమ.

"దానేముంది లెండి. ఒకొక్కళ్ళకి ఆలస్యంగా పుడతారు. ఒకొక్కరికి త్వరగా పుడతారు" పైకి అంది.

"అవన్నీ మన ఏడుపు తుడుచుకోవటానికి అనుకునే మాటలు. మాలో యెవరికి ఆలస్యంగా పుట్టటమనేది లేదు. వీళ్ళ నాన్నగారు ముందు ఒకావిడను చేసుకొన్నారు. నాలుగేళ్ళయినా పిల్లలు పుట్టకపోయేసరికి నన్ను చేసుకొన్నారు. సంవత్సరం తిరిగేసరికి వీడు పుట్టాడు" కొడుకును చూపి అంది రుక్మిణమ్మ.

విజయ కాఫీకప్పులోకి చూస్తూ కూర్చుంది.

"ఏమిటీ? ఆవిడ బ్రతికివుండగా మిమ్మల్ని చేసుకున్నారా?" ఆశ్చర్యపోయింది ఉమ.

"ఆ" అంది ఆవిడ.

"ఇప్పుడున్నారా ఆవిడ....?" అడిగింది ఉమ.

"లేదు. మా మూర్తి పుట్టాక ఏడాదికే పోయింది" 'అవును. పోక యింకెలా వుంటుంది? మొగుడు చేసిన పనికి మనసులోనే కుళ్ళిపోయి అప్పుడే చచ్చిపోయి వుంటుంది' లోపల అనుకొంది ఉమ.

"అయినా యెక్కడలేని విడ్డూరాలు పుడుతున్నాయిగాని, మా కాలంలో యెరుగుదుమా? యేమిటో కాలం తిరగబడింది. పిల్లలు లేకపోయినా ఆ గొడ్రాలితోనేగాని పెళ్ళి చేసుకోకూడదట. పిల్లలు లేకపోయాక ఇహమా, పరమా?" మనసులోదంతా కక్కేసింది ఆవిడ.

ఉమ తెల్లబోయింది. మొదట్లో ముసలావిడ గనుక చాద స్తంగా మాట్లాడుతోందనుకొంది. కాని ఈ సాధింపు ఎత్తిపొడుపులు విన్నాక అలా అనిపించటంలేదు. విజయవైపు ప్రశ్నార్థకంగా చూసింది. విజయ ఎరుపెక్కిన ముఖం పైపంటితో క్రింది పెదవి నొక్కిపట్టి

తల కొద్దిగా వాల్చి కూర్చుంది. మూర్తి చాల ఏకాగ్రతగా పేపరు చూస్తున్నట్టు పేపరు పట్టుకుని కూర్చున్నాడు. ఉమ యిబ్బందిగా ఫీలయ్యింది. ముసలావిడ మరికొద్దిసేపు కూర్చుని లేచిపోయింది. మూర్తి తిరిగి బయట కెళ్ళాడు.

ఉమ ముందు సిగ్గుతో అవమానంతో తల పైకెత్తలేకపోయింది విజయ.

ఉమ మనసు అభిమానంతో ఆర్ద్రమైంది. విజయనింక యిబ్బంది పెట్టలేక, "ఇంక నేను వెళతాను విజయా. నువ్వోసారి రేపు అక్కడికి రాకూడదూ. మేము రేపు సాయంత్రం బండికి వెళ్ళిపోతాం" అంది.

విజయ గొంతు పెగల్చుకుని, "ఈ పూటకు యిక్కడుండు ఉమా. రేపు వెడుదువులే!" అంది.

"ఇప్పటికేమనుకోకు. ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా వుంటాను" అంది.

విజయ యింకేమీ మాట్లాడలేదు. తనను కించపరచే ఆ యింట్లో తన స్నేహితురాలిని వుండమనటానికి అభిమానం అడ్డు వచ్చింది. అందుకే బలవంతం చెయ్యలేదు.

ఆ రాత్రి—బయటనుండి వచ్చిన మూర్తి బట్టలు మార్చుకోవటానికి గదిలోకి వచ్చాడు. విజయ మంచంమీద బోర్లా పడుకుని వుంది. విజయనేం మాట్లాడించకుండా తల్లి నడిగి అన్నం పెట్టించుకున్నాడు. ఆవిడ కొసరి కొసరి పెడుతూ, కాలాక్షేపానికి కబుర్లు చెబుతోంది. ఆవిడ కబుర్లు పూర్తికాకముందే అతని భోజనం పూర్తయిపోయింది. గదిలోకి వెళ్ళి వక్కపొడి కోసం చూశాడు. కనిపించలేదు.

"ఇదిగో వక్కపొడి యెక్కడుంది? పడుకున్నావేం?" విజయ నుద్దేశించి అన్నాడు.

విజయ లేచి వక్కపొడి భరిణె ఇచ్చింది.

"ఇదిగో అన్నం వడ్డిస్తున్నాను. నేను మళ్ళీ యిల్లు సర్దుకోవాలి. త్వరగా రా" అత్తగారు పిలిచింది.

"నాకు ఆకలి లేదు. మీరు తినండి" అంది విజయ.

"ఏం వున్నా లేకపోయినా ఈ రోషాలకేం తరుగులేదు. 'ఊ' అంటే వుపరాధం. 'ఆ' అంటే అపరాధం. మహారాణిలా పడుకున్నది గాక నడ్డి విరిగేలా పనిచేసి, వండి వడ్డిస్తే తినటానికి కష్టంగా వుందా?" విజయ ఏ పనీ చెయ్యకపోయినా సహిస్తున్నదానిలా, ఎంతో వుదారంగా వండి వడ్డిస్తున్నట్టు మాట్లాడింది.

"నా ఆకలి నాకు తెలుసు. ఒకరు చెప్పనవసరంలేదు" కోపం నిగ్రహించుకొని అంది.

"అవును, చెపక్కర్లేదు. చెబితే మాత్రం పెద్దవాళ్ళ మాట అని నీకు లక్ష్యమా? వినయమా? ఏముంది గనుక? చెప్పి నా నోరే నెప్పెడుతుంది."

"పోనీ అదయినా తెలుసుకున్నారుగా. మరోసారి చెప్పకండి" నిష్కర్షగా అంది విజయ.

"విజయా!" కాస్త గట్టిగా అసహనంగా అన్నాడు మూర్తి.

"పెద్దా చిన్నా లేకుండా యేమిటా మాటలు?"

"పెద్దవాళ్ళయినా చిన్నవాళ్ళయినా మర్యాద యిచ్చి పుచ్చుకోవాలి. సహనానికి కూడా హద్దుండి."


"ఏం, మళ్ళీ ఈవేళ ఏమైంది? భోజన మెందుకు చెయ్యలేదు? అసలు రోజు రోజుకు చిత్రంగా తయారవుతున్నావు. ఈ సత్యాగ్రహా లేమిటి? రాను రాను యిల్లు నరకమౌతోంది."

తాను విచిత్రంగా తయారవుతోందా? తిప్పి మాట్లాడుతున్నాడు. ప్రతిక్షణం తనను ఎత్తి పొడుస్తూ, నరకం చూపుతున్నారు. తిరిగి తననే అంటున్నారు. ఇంక అణుచుకోవటం దుస్సాధ్యమైంది. "నేనూ అదే అడగాలనుకుంటున్నాను. రోజు రోజుకు మీరెందుకిలా మారిపోతున్నారు?" అంది.

"మారిపోతున్నానా, నేనా?" కించిత్ ఆశ్చర్యంగా, అదోలా అన్నాడు.

"అవును మీరే. మీ మనసులో ఏముందో సూటిగా చెప్పక, వ్యంగ్యంగా మాట్లాడి నన్నెందుకు బాధిస్తున్నారు?"

"నేనేం మారలేదు. నువ్వే చీటికి మాటికి తగాదాకు తయారవుతున్నావు. ప్రతి చిన్నదానికి రాద్ధాంతం చెయ్యటం నేర్చావు. మనిషన్న




తరువాత కాస్త ఓర్పు, సహనం ఉండాలి. సర్దుకుపోవాలి."

తెల్లబోయింది విజయ. దేనికి సర్దుకుపోవాలి? అతను రెండో పెళ్ళి చేసుకోవటానికా? ఓ నిముషం తరువాత తేరుకుని "ఒక్క క్షణం మనస్సాక్షితో ఆలోచించి అనండా మాట" అంది.

"నేను అబద్దాలు చెప్పటంలేదు, మనస్సాక్షితో ఆలోచించటానికి."

"పోని యిదయినా చెప్పండి. పిల్లలు పుట్టటం నా చేతిలో పనా? నేను వద్దన్నానా?"

"నువ్వు ఏమంటే యేం? నేను పిల్లలు లేనివాడిననే బాధ తప్పదుగా."

"నాకేనా బాధ లేనిది?" ఆవేదనగా అంది.

"నీ బాధ నాకేం తెలుసు? నా బాధ నాకు తెలుసు. నా కెంత వెలితిగా వుందో నీకు తెలుసా!"

"అవును. నా బాధ మీకు తెలియదు. కనకనే యే మాట పడితే ఆ మాట అని అవమానించగలుగుతున్నారు."

"విజయా, నన్ను అనవసరంగా విసిగించకు. ఇప్పుడు నిన్నెవరవమానించారంటావ్?" చిరాకుగా అన్నాడు.

"రోజూ మీ అమ్మగారనే మాటలు, మీ యెత్తిపొడుపులు అన్నీ మంచిమాటలే. ఈ రోజు ఉమ ముందు ఆవిడ మాట్లాడినవి అవమానించేవి కావా, చెప్పండి?"

"అంత పెద్ద విషయం ఆవిడేమంది? చిన్నది కూడ కొండంత చేస్తావు?" కరుకుగా అన్నాడు.

"చిన్న విషయం! రెండో పెళ్ళి చేస్తాననటం కూడ చిన్న విషయమేనా?" ఆవేశంగా అడిగింది.

"చిన్న విషయం కాక పెద్ద విషయమా? ఏం మహా గింజుకుంటున్నావు. చేసుకుంటాడు మళ్ళీ పెళ్ళి. యేం చేస్తావేం?" అంది ఆదరా బదరా అన్నం పూర్తిగా తినకుండానే వచ్చిన అత్తగారు.

"నేను మీతో మాట్లాడటంలేదు" తీక్షణంగా అంది విజయ.

అయినా ఆవిడ లెక్క_చెయ్యలేదు. "ఏం నిలదీసి అడుగుతున్నావు? ఎల్లకాలం నిన్నే పూజిస్తూ కూర్చుంటాడనుకున్నావా? మహా తల్లివి వంశాన్ని వుద్ధరిస్తావని"

మూర్తి మాట్లాడకపోయేసరికి తిరిగి తనే అంది.

విజయ విసురుగా మూర్తికేసి తిరిగి, "మీరు నిర్లక్ష్యం చెయ్యబట్టేకదూ ఆవిడిలా మాట్లాడేది. నేను మీతోనా ఆవిడతోనా మాట్లాడుతున్నది" అంది.

"అవును వాడలా మాట్లాడకపోబట్టే నువ్విలా పెత్రేగిపోతున్నావు?" చేతులు తిప్పుతూ అంది రుక్మిణమ్మ.

"ఏమిటి మీ మౌనం? మీరు ఆవిడను సమర్థిస్తున్నట్లా?"

"ముందు నువ్వు కాస్త నోరు మూసుకో" అని "అమ్మా, నువ్వెళ్ళు" అని 'ఛీ, వెధవ కొంప' అనుకుంటూ బయటకు వెళ్ళాడు.

విజయ మనసు భగ్గుమంది. అంతకు ముందు కలిగిన బాధ-కోపంగా, అసహ్యంగా మారింది.

ర ర ర

ఆ తరువాత ఒకటి రెండుసార్లు తాను యింట్లో లేని సమయంలో గుసగుస లాడు కోవటం, తను రాగానే మానెయ్యటం గమనించింది.

అందుకు ముందు మూర్తిమీద ఏ మూల నుండో పీకుతున్న ప్రేమకూడ విరిగిపోయింది. అత్తరంటే చాదస్తురాలు, పాతకాలపుమనిషి. కాని మూర్తి? చదువు, సంస్కారం, విచక్షణ అన్నీ వున్నాయని గర్వించే ఆధునికుడు! ఇంత సంకుచితమా? ఇలాటి మనిషిని తన మనసులో మనసుగా నమ్మిన భర్త అనుకుంటేనే సిగ్గుగా, భరింపరానిదిగా అనిపిస్తోంది. ఇంత సంకుచితులమధ్య,తనను హీనపరచే వాళ్ళమధ్య తనెలా వుండగలదు? ఏదీ ఖచ్చితంగా నిర్ణయించుకోలేకపోతోంది.

అనుకోకుండా ఆ మరుసటిరోజే ప్రసాద్ వచ్చాడు. హఠాత్తుగా వచ్చిన అన్నను చూసి ముందు విజయకు సంతోషం కలిగినా, ఇలాటి పరిస్థితుల్లో అతను రావటం ఇబ్బందిగా అనిపించింది. విజయే వుత్తరం వ్రాసి రప్పించిందనుకున్నారు తల్లీ కొడుకులు.

"ఏం బాబూ, యిదేనా రావటం?" అంటూ బాగానే పలకరించింది రుక్మిణమ్మ.

"లేదండి, రాత్రి 10 గం॥ల ట్రైన్‌కు వచ్చాను" అన్నాడు.

"ఏం బావగారూ, కులాసాయేనా?" అని తనే పలకరించాడు మూర్తిని ప్రసాద్.

తరువాత కూడ అతను అది యిది మాట్లాడుతుంటే మూర్తి ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు.

"సరేలే, ముందు భోజనాలకు లేవండి" అంటూ తనే వడ్డించింది రుక్మిణమ్మ.

ఆవిడ తీరు విజయకు చాల ఆశ్చర్యంగా వుంది. ప్రసాద్‌ను చూడగానే, 'ఈ పిల్లలు పుట్టని కోడలు మా కెందుకు? నీతోనే తీసుకుపో' అంటుందనుకుంది.

ప్రసాద్‌కు అసలే ఓపాలు ఆవేశం యెక్కువ. ఏం జరుగుతుందో అని భయపడింది.

"బావగారూ! మిమ్మల్ని, విజయను ఓసారి రమ్మని చెప్పమన్నారు అమ్మా, నాన్నగారు. విజయకోసం వాళ్ళ వదిన కలవరిస్తోంది.. తప్పక రావాలి" అన్నాడు ప్రసాద్.

మూర్తి మాట్లాడలేదు.

ప్రసాద్, "మాట్లాడరేమండీ?" అంటూ రెట్టించాడు.

"సెలవు దొరకదు" పొడిగా అన్నాడు మూర్తి.

"మీరలా అంటే కుదరదు. ఎలాగైనా రావలసిందే. ఏమే విజయ మాట్లాడవు...." అన్నాడు.

విజయ మాట్లాడలేదు.

"ఏమిటేవ్, బావగారు నీకుకూడ అంటించారా తన మౌనాన్ని. నువ్వేమిటి అసలు మాట్లాడటంలేదు? కొంపదీసి మీరిద్దరు కోర్ట్

వార్‌లో గాని లేరుకదా?" నవ్వాడు.

ఎవ్వరూ నవ్వలేదు అతని హాస్యానికి. ప్రశ్నార్థకంగా విజయకేసి చూశాడు. కాని విజయ అతనివైపు చూడటంలేదు.

మరో అరగంట తరువాత "మరి నేను వెడతాను. మీరు తప్పక రావాలి. నాన్నగారు విజయను చూడాలని చాల యెదురు చూస్తున్నారు" అన్నాడు.

వెంటనే రుక్మిణమ్మ, "కూర్చో బాబు, అసలు నేనే మీ వూరు వద్దామనుకుంటున్నాను. ఇంతలో నువ్వే వచ్చావు" అంది.

"అలాగా, అయితే మాత్రం ఏం లెండి. అందరూ కలిసిరండి. నాకు టైమ్‌లేదు. రేపు కోర్టులో కేసు వుంది. ఈ ట్రైన్‌కు వెళ్ళిపోవాలి" అన్నాడు.

"అదికాదు, నీతో కొంచెం మాట్లాడాలి. ఓ రెండు నిమిషాలు కూర్చో" అంది ఆవిడ.

తిరిగి కూర్చున్నాడు. "ఏమిటి, చెప్పండి" అడిగాడు.

"ఏంలేదు? పిల్లాపాపలతో కళకళలాడాల్సిన యిల్లు. ఆ గీతే వున్నట్టు లేదు."

"నిజమేనండి. ఎందుకో ఆలస్యమైంది. విజయ అక్కడకు వస్తుందిగా. టెస్టు చేయిద్దాం."

"ఏమో మరి. నాకయితే యింక పుడతారని నమ్మకంలేదు."

"సరే, మనం చేసేది మనం చేద్దాం. ఇంతకంటే ఆలస్యంగా పిల్లలు పుట్టినవారు లేరూ?"

"మనవల్ని చూసుకోవాలని నా ప్రాణం తపించిపోతోంది. వాళ్ళ పిల్లల్ని, వీళ్ళ పిల్లల్ని చూసి మురిస్తే మనవాళ్ళవుతారా? మనకు లేకపోయాక ఏం సార్థకత."

ఆవిడ వుద్దేశ్యం అర్థంకాలేదు ప్రసాద్‌కు. "ముందు డాక్టరుకు చూపుదాం. అంతకంటే చేసేదేముంది?" అన్నాడు.

"అదే నేను చెప్పబోయేది. ఇప్పటి కాలాన్నిబట్టి కాస్త యిదిగా వుంటుంది. కాని, మా రోజుల్లో పిల్లలు పుట్టకపోతే రెండు మూడు పెళ్ళిళ్ళు చేసుకునేవారు" మెల్లగా బయట పెట్టింది ఆవిడ.

ప్రసాద్ అప్రతిభుడయ్యాడు. ఆవిడ వుపోద్ఘాతమంతా దేనికో అర్థమయింది. ముఖం జేవురించింది. "అయితే యేమిటి మీరనేది?" తీవ్రంగా అడిగాడు.

"ఇదే విజయకూడ యిక్కడే వుంటుంది. వాడికి మళ్ళీ ఏ పేదింటి పిల్లనో ముడిపెడదామని. లోకంలో యెంతమందికి యిద్దరేసి పెళ్ళాలు లేరు. వంశం పోతుందని నా బాధ."

ప్రసాద్ అగ్గి అయిపోయాడు. "మీరేం మాట్లాడుతున్నారో వంటిమీద తెలివి వుండే మాట్లాడుతున్నారా? పెళ్ళంటే బొమ్మలాటనుకున్నారా? పైగా యిద్దరు పెళ్ళాలవాళ్ళున్నారని సమర్థింపా? ఛీ" చీత్కారంగా అన్నాడు.

రుక్మిణమ్మ అప్పటివరకు సహనంతో వుంచుకున్న ఆప్యాత ముసుగు కాస్త తీసిపారేసింది. "ఏదో వియ్యాలవేపువాడివని మర్యాద యిచ్చి సంగతీ, సందర్భం మాట్లాడాను. ఏం మహా గుంజుకుంటున్నావు. పెళ్ళి చెయ్యక నీ చెల్లెల్నే పూజిస్తామనుకున్నావా?" అంది.

అక్కడే వున్న మూర్తి పేపరులోంచి తల బయటకు తియ్యలేదు. విజయ మాత్రం అవమానంతో క్రుంగిపోయింది. తల పైకెత్తి అన్నకేసి చూడలేకపోయింది.

"మరో అమ్మాయికి మాత్రం పుడతారని నమ్మకమేమిటి?" లాయర్‌లా క్రాస్ చేశాడు ప్రసాద్.

"ఏం, నీ చెల్లెలు గొడ్రాలయిందని దేశం మీద అందరు గొడ్డుపోతారా?"

'గొడ్రాలు' అనేసరికి ప్రసాద్ నిగ్రహించుకోలేకపోయాడు.

"మర్యాదగా మాట్లాడండి" నిప్పులు కురిపిస్తూ చూశాడు. ఆ వెంటనే మూర్తివైపు తిరిగి, "ఏం బావగారూ మీ అభిప్రాయంకూడ యిదేనా?" అన్నాడు.

మూర్తి మాట్లాడలేదు.

"మాట్లాడండి" గద్దిస్తున్నట్టే వుంది ప్రసాద్ కంఠం. "ఇంతసేపటినుండి ఆవిడ మాటలు వింటూ కూడ మాట్లాడలేదంటే మీ

వుద్దేశ్యం ఆవిడతో చెప్పిస్తున్నారన్నమాట. అంతేనా?"

"ఇదిగో, వాడు చెబితే ఒకటి నేను చెబితే ఒకటి కాదు. మేం చెప్పేది చెప్పాం. ఇష్టమైతే వుంచు, లేకపోతే తీసుకుపో. అంతే" ఖరాఖండితంగా చెప్పింది రుక్మిణమ్మ.

"విజయ భర్త ఆయన కాని, మీరు కాదు. నోరు విప్పి చెప్పలేని అసమర్థుడా?"

"ప్రసాద్!" రోషంగా పేపరులోంచి తల బయటపెట్టి అన్నాడు మూర్తి.

"అంత రోషం కలవారు నేను అడిగేదానికి జవాబు చెప్పండి!" హేళనగా అన్నాడు ప్రసాద్.

"అవును. మా అమ్మ మాట నిజమే."

"ఇప్పుడు వాడి నోటితో విన్నావుగా. తృప్తిగా వుందా?" అంది రుక్మిణమ్మ.

"అలాగా, చూస్తాను. పెళ్ళి ఎలా చేస్తారో? నేను లాయర్‌నని మర్చిపోకండి" అన్నాడు.

"ఏం చేసుకుంటావో చేసుకో. కోర్టులకు మాత్రం న్యాయం, ధర్మం లేవా? గోడ్డుదానితో వుట్టిగట్టుకు వూరేగమంటాయా!"

"గొడ్రాలని మీకు రుజువేమిటి?" కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహాన్ని పళ్ళ బిగువునా ఆపుతున్నాడు.

"పెళ్ళయి ఆరేడు ఏళ్ళు అవుతోంది. పుట్టి చావటమేనా లేదు. ఇంక పుడతారా?"

"సరే, అదీ తేల్చుకుందాం. డాక్టర్ దగ్గరకు వెడదాం" అని "విజయా, లే!" అన్నాడు.

ఇంతదూరం వచ్చాక నిజంగా తనకు తల్లి అయ్యే యోగ్యత వుందో లేదో తేల్చుకోవాలనిపించింది విజయకు. రెండు నిముషాల్లో వచ్చింది.

"లేవండి, వెడదాం" మూర్తి నుద్దేశించి అన్నాడు ప్రసాద్.

"వెళ్ళరా, వీళ్ళు నిజమే చెబుతారో, ఆ డాక్టర్‌తో అబద్ధమే చెప్పిస్తారో, యేమిటి నమ్మకం?" ప్రసాద్‌ను, విజయను కొరకొర చూస్తూ అంది.

"ఓహో! మీ అబ్బాయిని మామీద నిఘాకు పంపుతున్నారన్నమాట. కాని నేనందుకు తీసుకు వెళ్ళటంలేదు. మీ అబ్బాయికి పిల్లలు పుడతారో లేదో పరీక్ష చేయించటానికి."

రుక్మిణమ్మ నిర్ఘాంతపోయింది. "ఇదిగో, ఇప్పుడంటే అన్నావుగాని, మరోసారి ఇలాటి అప్రాచ్యపు మాటలు మాట్లాడకు. పిల్లలు పుట్టకపోవటం మా యింటావంటా లేదు" తెప్పరిల్లి అసహనంగా అంది.

ఇంకా ఏదైనా అని ఆవిడను ఏడిపించాలనిపించింది ప్రసాద్‌కు. క్షణానికోసారి విజయను గొడ్రాలన్న మనిషికి తన కొడుకు విషయంలో యెంత బాధ, కోపం? కాని అందరూ అలాటి మనుషులు కారనుకుందేమో!

డాక్టర్ శ్రీకాంత్ ఫారిన్ రిటరన్డు దగ్గరకు వెళ్ళారు.

* * *

విజయ సూట్‌కేస్ సరుకుంటోంది.

మూర్తి అక్కడే వున్న కుర్చీలో కూర్చుని వున్నాడు. ఆ క్రితంరోజే డాక్టర్ దగ్గరనుండి టెస్టు ఫలితాలు వచ్చాయి.


"విజయా! నీ నిర్ణయం మారదా?" జాలిగా వుంది మూర్తి స్వరం. అతనిముఖంలో తనకు అవసరమైనది, అతి ముఖ్యమైనది కోల్పోతున్న దైన్యం వుంది.

"ప్లీజ్, విజయా! నాకోసం మార్చుకో."

విజయ సూట్‌కేస్ సర్దటం ఆపి గిరుక్కున వెనక్కు తిరిగింది. "మీకోసం!? హు, యెంత నిస్సంకోచంగా అడుగుతున్నారు. ఒక్కసారి వెనుతిరిగి ఆలోచించుకోండి. నాకోసం మీ నిర్ణయాలను మార్చుకోవటం కాదు కదా, కనీసం సానుభూతితోనయినా ఆలోచించారా? భార్యననే అభిమానం, తోటిమనిషిననే మానవత్వం అయినా లేకుండా మీ కనుకూలంగా నిర్ణయాలు తీసుకున్న మీరు, నాకేమవుతారని నేను నా నిర్ణయం మార్చుకోను?"

"విజయా!" తెల్లబోయాడు. "నేను నీకేం కాను."

"ఎందుకలా తెల్లబోతారు? మీరు మరో పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు మీకు నేనేమయ్యాను? ఈ వూరు కా వూరు యెంత దూరమో ఆ వూరుకు ఈ వూరు అంతే.




దూరం వుంటుంది.''

మూర్తి అసహనంగా చూశాడు. "విజయా! ఈ వాదోపవాదాలు అనవసరం? నువ్వు వెళ్ళటానికి వీల్లేదు" గట్టిగా అన్నాడు.

"అలా ఆజ్ఞాపించే హక్కు మీ చేతులతో మీరే పోగొట్టుకున్నారు" అటు తిరిగి పోయింది.

మూర్తి మాట్లాడలేకపోయాడు. విజయ సర్దుతున్న చీర మడతల్లోంచి ఓ చిన్న ఫ్రాక్ జారి క్రింద పడింది. అది రెండు సంవత్సరాల క్రితం తన జాకెట్ పీస్‌లో మిగిలిన బట్టతో కుట్టింది విజయ. ఎంతో చక్కగా ముద్దుగా కుదిరింది. పుట్టని పాపాయికోసం యెదురు చూస్తూ పెట్టెలోనే వుండిపోయింది ఇన్నాళ్ళు.

విజయ వంగి క్రింద పడిన ఫ్రాక్ చేతిలోకి తీసుకొంది. కళ్ళు చెమర్చాయి.

"విజయా! నీకు బాధ అనిపించటంలేదూ," చాలా సేపటికి అడిగాడు మూర్తి.

"బాధ?! నాకు బాధ లేదని యెలా అనుకోగలుగుతున్నారు? ఇటు చూడండి" ఫ్రాక్ పైకి యెత్తి చూపుతూ, "పిల్లలకోసం అసలు మగవాడికంటె ఆడదానికే యెక్కువ తహతహ నేమో! ప్రతిస్త్రీ బలంగా కోరుకునేవాటిల్లో మాతృత్వం ముఖ్యమైనది. అమ్మను కావాలని వాళ్ళ ఆటపాటలతో మురిసిపోవాలనే కోరిక అతి సహజం. కాని....కాని మీ కారణంగా వాట్ని కోల్పోయాను" అంది.

మూర్తి ముఖం దించుకున్నాడు.

"అయినా నే నెప్పుడు దీనికి కారణం ఎవరని ఆలోచించలేదు. మనకు ఆ అదృష్టం లేదనుకున్నాను. అంతే!" ఉబికిన కంటినీరు క్రిందికి జారకుండానే తుడుచుకుంది.

బట్టలు సర్దటమయింది. షెల్ఫ్‌లోంచి తను మనసుపడితే ప్రసాద్ కొని యిచ్చిన పుస్తకాలు ఒక్కొక్కటి తీసిపెట్టి కట్టకట్టింది.

"విజయా. ప్లీజ్! ముందు నువ్వాపని ఆపెయ్యి. ఇటు కూర్చుని నేను చెప్పేది విను" అర్థింపుగా అడిగాడు.

"మనిద్దరం అలా కూర్చుని సమస్య గురించి చర్చించుకొనే సమయం దాటిపోయింది. ఒకసారి నే నందుకు ప్రయత్నించినప్పుడు మీరు నిర్లక్ష్యంగా వెళ్ళిపోయారు. ఇప్పుడా అవసరంలేదు. గతం యెప్పుడూ భవిష్యత్తులో తిరిగిరాదు" చేస్తున్న పని ఆపకుండానే చెప్పింది.

"విజయా! నన్ను నువ్వు అర్థం చేసుకోవటంలేదు. నా మనసు మారింది."

చఱ్ఱున యిటు తిరిగింది విజయ. "అవును,

మీ మనసు మారింది. అవసరం మీదయినప్పుడు యెందుకు మారదు? మీరు అవకాశవాదులు. ఎలాపడితే అలా మారగల సమర్థులు. చూడండి. ఎలాగూ విడిపోతున్నాం. ఇంక మాటలనుకోవటం అసహ్యం."

"ముందు నా మాట పూర్తిగా వినవేందుకు? అసలు నేను చేసుకోవాలన్నది కేవలం పిల్లల కోసం. నిన్ను విడిచిపెటాలని నేనెప్పుడూ అనుకోలేదు నేను. కాకపోతే ఇంత బాధపడతావని అనుకోలేదు నేను. అదే పొరపాటు."

"అయితే ఇది చెప్పి మళ్ళీ పొరపాటు చేస్తున్నారు? ఇంత జరిగినా పెళ్ళి పిల్లలకోసమని, భార్య అంటే పిల్లలు కనే యంత్రమనే మారని మీ అభిప్రాయాలు వింటుంటే....వుహు, నా నోటితో చెప్పలేను. మీ ప్రేమంతా నామీద ఒలికించి, వచ్చే ఆమె కేవలం పిల్లలకోసమే అంటే నేను సంతోషిస్తానని అనుకుంటే మీరు చాలా పొరపాటుపడ్డారు. అదే నా స్వభావమైతే యిప్పుడు విడిపోయే ప్రసక్తే రాదు. అయినా మీరు ఏది చెబితే అది నమ్మే విజయను కాను ఇప్పుడు. ఒకప్పుడు మీరేది చెబితే అదే నిజమని గుడ్డిగా నమ్మేదాన్ని. మీరే మార్చేశారు. ఈ పిల్లల ప్రసక్తే లేకపోతే మీ ప్రేమంతా నిజమేననే భ్రమలో వుండేదాన్ని. మీరా భ్రమలో కూడా వుండనివ్వలేదు నన్ను."

సర్దుకోవటం పూర్తి అయింది. ముఖం కడుక్కొని వచ్చింది.

అప్పటివరకూ మూర్తి యెక్కడ కూర్చుని వున్నాడో అక్కడే కూర్చుని వుండిపోయాడు.

అద్దంలో చూస్తూ జడ అల్లుకుంటోంది. అద్దంలోంచి మూర్తి దగ్గరకు రావటం కనిపించింది విజయకు. అనుకోని విధంగా మీద చేతులేసి ఆమెను తనవైపు తిప్పుకున్నాడు. "విజయా,జరిగింది మర్చిపోయి నన్ను క్షమించలేవా?" అడిగాడు.

విజయ మాట్లాడలేదు.కాని ఆమె ముఖంలో కనిపిస్తున్న ఏహ్యాత, కఠినత్వం చూసి, అతనే అప్రయత్నంగా వదిలేశాడు.

"అంత క్షమాశక్తి నాకులేదు. అసలు క్షమ యెవరికో తెలుసా? తెలియక తప్పు చేసిన వారికి. తెలిసి చేసేవాళ్ళకు కాదు. జరిగింది నేనెంతమాత్రం మర్చిపోలేను. కొద్దిరోజుల క్రితం మీకు నా మనసులో యెంతో వున్నతమైన స్థానం వుంది. మీరు ఊసరవెల్లిలాటివారని తెలిశాక మళ్ళీ అలా చూడలేను. మీరే నేను, నేనే మీరని నమ్మాను. మీకు మీ కోరికలు, అవసరాలే ప్రధానం కాని వ్యక్తిప్రధానం కాదని ఆలస్యంగా తెలుసుకోగలిగాను. తెలిసాక యిక్కడుండలేను. నన్ను నేను వంచించుకోలేను."

"అయితే....అయితే, నువ్వు విడిపోవటం పిల్లలకోసం మళ్ళీ పెళ్ళి చేసుకోవటానికేనా?" ఏం చెయ్యలేని నిస్సహాయ క్రోధంతో అడిగాడు.

"పిల్లలు పుట్టరని నన్ను విడిచి మరొకరిని చేసుకోవాలని మీరు అనుకోలేదా? డాక్టర్ మీకు సంతానం కలగదని నిర్ధారణగా చెప్పాక ఆ పిల్లలకోసం నేను పెళ్ళి చేసుకోవటంలో తప్పేముంది? కోరిక అందరికి ఒకటే. ఆడవాళ్ళకు ఒక న్యాయం, మగవాళ్ళకో న్యాయమా?" నిశితంగా చూస్తూ అడిగింది.

మూర్తి ముఖం వివర్ణమైంది. విజయ బ్యాగ్ చేతిలోకి తీసుకుంది.

"కానీ మనిషి పెళ్ళి చేసుకునేది కష్టసుఖాలలో తోడునీడగా వుండే మరో మనిషి సామీప్యంకోసం అని నా అభిప్రాయం. పెళ్ళి తరువాత పిల్లలుకాని, పిల్లలకోసం పెళ్ళికాదు. అలాటి పొరపాటు నేనెప్పుడు చెయ్యను" దృఢంగా పలికింది.

"వెళ్తాను" అని ముందుకు నడిచింది.

తనను దాటుకుని ముందుకు వెళ్ళిపోతున్న ఆమెను చూస్తూ నిలబడిపోయాడు మూర్తి.